APTEL/2008/28200

## ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించిన ఎమ్మెల్యే సబిత

రంగారెడ్డి : బడంగ్ పేట్ , మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నీ నిర్మాణంలో ఉన్న వివిధ ప్రభుత్వ పాఠశాలను మాజీ విద్యా శాఖ మంత్రి స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పరిశీలించారు. పాఠశాలలు జూన్ నెలలో తిరిగి రీ ఓపెన్ అవుతున్న సందర్భంగా నిర్మాణంలో ఉన్న వివిధ పాఠశాలలను అధికారులు స్థానిక కార్పొరేటర్ తో కలిసి పరిశీలించారు. గత ప్రభుత్వం హయాంలో మెగా ప్రాజెక్ట్ సిఎస్ఆర్ కింద 12 కోట్లతో మూడు స్కూల్ బిల్డింగ్లను ప్రారంభించిన మెగా సంస్థ, అందులో భాగంగా వివిధ పాఠశాలను పనులను అధికారులు కాంటాక్ట్ ల ద్వారా అడిగి తెలుసుకున్నారు.. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బడంగ్ పెట్ ప్రభుత్వ పాఠశాలను ఇక్కడకి తరలించి. పాత ప్రభుత్వ పాఠశాలలో గవర్నమెంట్ హాస్పిటల్ నిర్మిస్తామని అన్నారు. పనులన్నీ తొందరగా కంప్లీట్ చేసి పిల్లలకు జూన్ మాసంలో అందుబాటులో ఉంచాలని.




# తెలంగాణ ఫోకస్

తెలుగు దినపత్రిక

ప్రజల తెలంగాణ ప్రతిబింబం


## అవినీతి ఆరోపణలకు అడ్డాగా సివిల్ సప్లై శాఖ

నల్లగొండ : బీజేపీ ఎంపి బండి సంజయ్ శనివారం నాడునల్గొండ లో పర్యటించారు. బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి ను గెలిపించాలని విజ్ఞప్తి చేసారు.సంజయ్ మాట్లాడుతూ ప్రేమేందర్ రెడ్డి కి మొదటి ప్రాధన్యత ఓటు వేస్తామని అంటున్నారు. ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ మోసం చేసింది. పార్లమెంటు ఎన్నికల్లోనూ మరోసారి మోసం చేయాల్ని చూసింది. మేము కాంగ్రెస్ మోసాలపై పొరాడుతున్నం.. అవసరమైతే జైళ్ళకైన పోతాం. వ్యవసాయాన్ని పూర్తిగా నాశనం చేసింది బీఆర్ఎస్ . కాంగ్రెస్ అదే దారిలో నడుస్తుంది. ధాన్యం కొనుగోళ్లలో.. కటింగ్ లేకుండా కొనట్లేదు. 500 బోనస్ అడ్రస్ లేదు. అవినీతి ఆరోపణలకు అడ్డాగా సివిల్ సప్లై శాఖా ఉంది. కాళేశ్వరం తర్వాత ఎక్కువ స్కామ్ ఇదె. సివిల్ సప్లై శాఖా నష్టాల్లో ఉండటానికి కారణమేంటి..? బీఆర్ఎస్ హయాంలో జరిగిన అవినీతే.. కాంగ్రెస్ లోనే నడుస్తున్ది. రైస్ మిల్లర్ల తో కుమ్మక్కై దోపిడీ పాల్పడుతున్నారు.

సంపుటి: 16 సంచిక : 26 కరీంనగర్ ఆదివారం, మే 26, 2024 ఎడిటర్ : బోనగిరి నర్సింగ్ పేజీలు : 8 రూ. 2 రూపాయిలు

# ఆరోదశ ఎన్నికల్లో భారీ పోలింగ్



న్యూఢిల్లీ, మే 25 : దేశ రాజధాని ఢిల్లీలోని ఒక పోలింగ్ కేంద్రంలో దేశ ప్రథమ పౌరురాలు ద్రౌపదీ ముర్ము తన ఓటు వేశారు. రాష్ట్రపతి భవన్ సమీపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పింక్ బూత్‌కు వెళ్లి ఓటు వేశారు. రాష్ట్రపతి అయిన తర్వాత ద్రౌపదీ ముర్ము తొలిసారిగా లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేశారు. ఇక ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్, ఆయన సతీమణి సుదేశ్ క్యూలైన్‌లో నిల్చుని ఓటు హక్కు వినియోగించుకున్నారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ తొలి గంటల్లో ఓటేశారు. అలాగే, పోలింగ్ ప్రారంభమైన వెంటనే ఉదయం 7 గంటలకు కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ పోలింగ్ బూత్‌లో ఓటు వేసిన తొలి వ్యక్తి ఈయనే కావడంతో అధికారులు ఆయనకు సర్టిఫికేట్ కూడా ఇచ్చారు. ఆ విషయాన్ని ఆయన సోషల్ మీడియా ఎక్స్(ట్విట్టర్) వేదికగా పంచుకున్నారు. ఒక గాంధీ కుటుంబం శనివారం ఢిల్లీలో ఓటు వేసింది. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాలు న్యూఢిల్లీ స్థానంలోని పోలింగ్ బూత్‌లో ఓటు వేశారు. ఓటు వేసిన అనంతరం రాహుల్ గాంధీ కూడా తల్లి సోనియా గాంధీతో సెల్ఫీ దిగి పంచుకున్నారు. ప్రియాంక కుమార్తె మిరయా, కుమారుడు రేహాన్ వాద్రా క్యూలైన్‌లో నిలబడి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, సోనియా, రాహుల్, ప్రియాంక ఓటు వేసిన స్థానం నుంచి ఈసారి కాంగ్రెస్ అభ్యర్థి ఎవరూ లేరు. ఆప్‌తో పొత్తు కారణంగా ఈసారి న్యూఢిల్లీ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిని నిలబెట్టలేదు. అక్కడ ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థి సోమనాథ్ భారతి బరిలో ఉన్నారు.

# తెలంగాణ కాంగ్రెస్ కొత్త సారథి ఎవరు?

## రేసులో ముందున్న నేతలు వీరే



హైదరాబాద్, మే 25 : తెలంగాణలో టీపీసీసీ పదవి రేసులో చాలా మంది నేతలు అధిష్టానం వద్ద క్యూ కడుతున్నారు. ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రితో పాటు టీపీసీసీ అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తెలంగాణలో టీపీసీసీ అధ్యక్ష పదవిపై చాలా మంది నేతలు గంపెడు ఆశలు పెట్టుకున్నారు. మొన్నటి వరకు తెలంగాణలో లోక్ సభ ఎన్నికలు జరుగుతున్న తరుణంలో టీపీసీసీ చీఫ్ గా సీఎం రేవంత్ రెడ్డినే కొనసాగించింది కాంగ్రెస్ అధిష్టానం. పైగా పార్లమెంట్ ఎన్నికల్లో మొత్తం 17 స్థానాలకు గానూ 14 నియోజకవర్గాల్లో విజయం సాధించాలని టార్గెట్ ఇచ్చినట్లు వార్తలు వినిపించాయి. దీంతో అన్నీతానై ప్రచార బాధ్యతలు నిర్వహించారు సీఎం రేవంత్ రెడ్డి. ఇక ఆ ఎన్నికలు ముగిసి 10 రోజులు గడిచిపోయింది. ఎన్నికల ఫలితాలు కూడా జూన్ 4న రానున్నాయి. ఈ తరుణంలో కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుని పదవీ బాధ్యతల నుంచి సీఎం రేవంత్ నిష్క్రమించే అవకాశం ఉంది. ఇకపై కేవలం పరిపాలనా సంబంధిత విషయాలపైనే ఎక్కువ ఫోకస్ పెట్టనున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ ఖాళీ అయ్యే పదవి రేసులో అరడజనుకు పైగా నేతలపేర్లు వినిపిస్తున్నాయి. ముందుగా డిప్యూటీ సీఎంగా ఉన్న భట్టి విక్రమార్క కూడా టీపీసీసీ చీఫ్ రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో కర్ణాటక ఎన్నికల్లో ముఖ్యమంత్రి పదవి సిద్దరామయ్యకు కేటాయించే తరుణంలో డిప్యూటీ సీఎంతో పాటు కర్ణాటక అధ్యక్షుని పదవీ బాధ్యతలు కూడా డీకే శివకుమార్?కు కేటాయించిన సందర్భాన్ని గుర్తు చేస్తున్నారు. అయితే ఈ పదవిపై జగ్గారెడ్డి కూడా గంపెడు ఆశలు పెట్టుకున్నారు. ఆయన ఇప్పటికే ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయిన తరుణంలో ఏదైనా పార్టీ బాధ్యతలు కేటాయించాలన ఆశగా ఉన్నారు. అందులో భాగంగానే ఈ అధ్యక్ష్యపదవిని ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే ఈ జాబితాలో వినిపిస్తున్న మరో పేరు పొన్నం ప్రభాకర్. ఈయనకు ప్రస్తుతం తెలంగాణ క్యాబెనెట్?లో స్థానం కల్పించారు. అయితే తాను స్టూడెంట్ యూనియన్ లీడర్ గా ఉన్నప్పటి నుంచే ఈ పార్టీని నమ్ముకుని పనిచేస్తున్నానని అందుకే అధ్యక్షుని బాధ్యతలు కేటాయిస్తే పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానని అధిష్టానానికి తెలిపినట్లు సమాచారం. ఇలా కాకుండా బీసీ, ఎస్సీ సామాజిక వర్గానికి ఈ పదవి ఇవ్వాలని అధిష్టానం ఆలోచిస్తే.. మధుయాష్కీ గౌడ్ పేరు కూడా బలంగా వినిపిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ తో పాటు ఏఐసీసీ సెక్రటరీ సంపత్‌కుమార్ కూడా ఈ పదవి కోసం ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. పైగా బీసీలకు కాంగ్రెస్ పెద్దపీట వేస్తామని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీ కులగణన చేస్తామని చెప్పిన మాటపై కట్టుబడి ఉండేందుకు ఈ పదవిని బీసీ నాయకుడికి ఇచ్చే ఆలోచనలో కూడా ఉన్నట్లు సమాచారం. అయితే ఇలా ఎవరికి వారే కీలక నేతలు తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షపదవిపై ఆశలు పెట్టుకోవడంతో ఈ సీటు ఎవరికి వరిస్తుందా అన్న ఉత్కంఠ రాజకీయ వర్గాల్లో నెలకొంది. లోక్ సభ ఎన్నికల ఫలితాల తరువాత దీనిపై కాంగ్రెస్ అధిష్టానం ఒక నిర్ణయం తీసుకుని స్పష్టమైన ప్రకటన వెలువరిచే అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో చర్చించుకుంటున్నారు.

# రేవ్ పార్టీలకు అడ్డా బెంగళూరు

## వారాంతాల్లో నిత్యకృత్యం



బెంగళూరు: బెంగళూరు అంటే ఎంతో పేరు ప్రఖ్యాతలు ఉన్నాయి. ఒకప్పుడు ఉద్యాననగరిగా, ఐటీ నగరిగా, ప్రస్తుతం స్టార్టప్?లకు హబ్‌గా అంతర్జాతీయస్థాయిలో పేరుంది. నగరం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోంది. అందుకు పలు కారణాలు ఉన్నాయి. ఐటీబీటీతోపాటు వందలాది కార్పొరేట్ కంపెనీలు ఉండడం. బెంగళూరుకు శివారు ప్రాంతాలైన సర్జాపుర, బన్నేరుఘట్టరోడ్డు, కనకపుర రోడ్డు, మైసూరురోడ్డు, ఎలక్ట్రానిక్ సిటీ ప్రాంతాల్లో వందలకొద్దీ రిసార్టులు, ఫాంహౌస్‌లు ఉన్నాయి. ప్రశాంత జీవనానికి పేరొందిన నగరం కావడంతో దేశ విదేశీయులు ఇక్కడికి వస్తుంటారు. ఆధునిక జీవనశైలి ఇక్కడ ఏటా పెరుగుతోంది. ఆధునికత పేరిట డ్రగ్స్ పార్టీ వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలు పెరుగుతున్నట్టు తెలుస్తోంది. కొన్ని స్టార్ హోటళ్లు, ఫాంహౌస్‌లు, పబ్‌లలో వారాంతమైతేచాలు పార్టీల హోరు సాగుతోంది. ఇటీవలికాలంలో నగర శివారు ఫాంహౌస్‌లలో పార్టీల సంస్కృతి పెరిగిపోతోంది. రేవ్‌పార్టీలు సాయంత్రం ప్రారంభమవుతాయి. దేశ, విదేశీ బ్రాండ్ల మద్యం, డ్రగ్స్, యువత హోరెత్తించే డ్యాన్స్‌లు అంతకుమించి డీజే శబ్దాలు ఉంటాయి. రాత్రి పొద్దుపోయేకొద్దీ మద్యంతోపాటు డ్రగ్స్‌కూడా సమకూరుస్తుంటారు. తెల్లవారుదాకా పార్టీ కొనసాగుతుంది. నగర ప్రాంతాల్లో పార్టీలు నిర్వహిస్తే భారీ శబ్దాలు భరించలేక వ్యతిరేకత వస్తుందనే నగర శివారు లేదా దూరప్రాంతంలోని ఓపెన్ ప్లేస్, లేదా ఫాంహౌసలలో నిర్వహిస్తారు. సాధారణంగా 50-100 మంది దాకా రేవ్‌పార్టీలో పాల్గొంటారని తెలుస్తోంది. ఒక్కోసారి ఈ సంఖ్య ఇంకా ఎక్కువగానే ఉంటుందని సమాచారం. ప్రతివారం లేదా ముందుగా నిర్ణయించుకున్న తేదీలకు అనుగుణంగా వాట్సప్ గ్రూప్‌లు ఏర్పాటు చేసుకుని ముందస్తుగా రిజర్వు చేసుకుంటారు. గంటలకొద్దీ పార్టీలో గడిపేందుకు మత్తు నిరంతరంగా ఉండేందుకు డ్రగ్స్‌కు అలవాటు పడతారని తెలుస్తోంది. డ్రగ్స్‌లో పాల్గొనేవారికి మెయిల్, వాట్సప ద్వారానే సమాచారం చేరవేస్తారు. మరోవైపు డ్రగ్ పెడ్లర్స్, నిర్వాహకులు కలసి కట్టుగానే ఏర్పాట్లు చేస్తుంటారు. డ్రగ్స్‌కు తీసుకునే వెరైటీతోపాటు మోతాదునుబట్టి వంద రూపాయల నుంచి లక్ష రూపాయల దాకా ఉంటుందని తెలుస్తోంది. గతంలో ఢిల్లీ, హైదరాబాద్‌లో ఎక్కువ సాగే రేవ్‌పార్టీలు ఇటీవల బెంగళూరువైపు మరలినట్టు తెలుస్తోంది. గత ఆదివారం ఎలక్ట్రానిక్‌సిటీలో జరిగిన రేవ్‌పార్టీలో వందమంది పాల్గొంటే 60-70 మంది తెలుగువారే ఉన్నారు. ఇద్దరు సినిమా నటులు, వారి ఆప్తులతోపాటు కొందరు డ్యాన్సర్లు సైతం హైదరాబాద్ నుంచే రప్పించినట్టు తెలుస్తోంది. రేవ్‌పార్టీలో మద్యం, డ్రగ్స్ మాత్రమే కాకుండా వ్యభిచారం కూడా కొనసాగుతుందని తెలుస్తోంది. బెంగళూరులో ఇకపై రేవ్‌పార్టీల పట్ల నిఘా పెంచుతామని మరోసారి ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠినంగా వ్యవహరిస్తామని నగర పోలీస్ కమిషనర్ దయానంద్ ప్రకటించారు. రేవ్‌పార్టీ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహించారని హెబ్బగూడి పోలీస్ స్టేషన్‌లోని ముగ్గురిపై సస్పెన్షన్ వేటు వేశారు. ఈమేరకు బెంగళూరు రూరల్ ఎస్పీ మల్లికార్జున బాలదండి శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఏఎస్ఐ నారాయణస్వామి, కానిస్టేబుళ్లు గిరీశ్, దేవరాజ్‌ను సస్పెండ్ చేశారు. ఏసీపీ, ఎస్ఐలకు మెమోలు జారీ చేశారు. రేవ్ పార్టీ జరుగుతున్నా ఎందుకు నిర్లక్ష్యం చేశారో వివరణ ఇవ్వాలని ఆదేశాలు పంపారు.

## ముగిసిన పోలింగ్...

## 57.70 శాతం పోలింగ్ నమోదు

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల ప్రక్రియలో భాగంగా శనివారం ఉదయం మందకొడిగా మొదలైన 6వ విడత పోలింగ్ చెదురుమదురు సంఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసింది. సాయంత్రం 5 గంటల వరకూ 57.70 శాతం పోలింగ్ నమోదైనట్టు ఈసీ తెలిపింది. పశ్చిమబెంగాల్‌లో అత్యధికంగా 77.99 శాతం పోలింగ్ నమోదు కాగా, జమ్మూకశ్మీర్‌లో అత్యల్పంగా 51.35 శాతం నమోదైంది. ఢిల్లీలో 53.73 శాతం, బీహార్‌లో 52.24, జారాండ్‌లో 61.41, ఉత్తరప్రదేశ్‌లో 52.02, ఒడిశాలో 59.60, హర్యానాలో 55.93 శాతం పోలింగ్ నమోదైనట్టు ఈసీ డాటా తెలిపింది. ఢిల్లీలోని మొత్తం 7 లోక్‌సభ నియోజకవర్గాలు, హర్యానాలోని 10, బీహార్‌లో 8, పశ్చిమబెంగాల్‌లో 8, ఒడిశాలో 6, జారా?ండ్‌లో 4, ఉత్తరప్రదేశ్‌లోని 14 లోక్‌సభ స్థానాలకు శనివారం పోలింగ్ జరిగింది.

# జాబ్ క్యాలెండర్ పెద్ద మోసం..

## 2 లక్షల ఉద్యోగాల ఊసే లేదు : కేటీఆర్



హైదరాబాద్ : జాబ్ క్యాలెండర్ పేరిట కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులను మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు. ఇప్పటి వరకు ఒక్క నోటిఫికేషన్ కూడా రాలేదు అని కేటీఆర్ తెలిపారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అనేక మోసాలు జరుగుతున్నాయి. 2 లక్షలు ఉద్యోగాలు ఏడాదిలో ఇస్తామన్నారు. ఒక్క నోటిఫికేషన్ కూడా రాలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రూప్-1 కింద 503 పోస్టులకు నోటిఫికేషన్ ఇస్తే.. దాన్ని రద్దు చేసి కొత్తగా 60 పోస్టులు కలిపి మళ్లీ నోటిఫికేషన్ ఇచ్చారు. దాన్ని కొత్త నోటిఫికేషన్ అంటున్నారు. 50 వేల పోస్టులతో మెగా డీఎస్సీ వేస్తమన్నాడు. తాము 5,089 పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తే దాన్ని కూడా రద్దు చేశారు. అయితే 50 వేల ఉద్యోగాలతో డీఎస్సీ నోటిఫికేషన్ వస్తదని అనుకుంటే.. 5,089 పోస్టులకు అదనంగా మరో 5913 కలిపి 11 వేల ఉద్యోగాలతో కొత్త నోటిఫికేషన్ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా నోటిఫికేషన్లు ఇచ్చిందేమీ లేదు. ఇవ్వకపోగా 2 లక్షల ఉద్యోగాల మాట తుంగలో తొక్కారు. జాబ్ క్యాలెండర్ అతిగతి లేదు. 4 వేల నిరుద్యోగ భృతి హామీ ఇవ్వలేదని భట్టి విక్రమార్క పచ్చి అబద్దం చెప్పారు అని కేటీఆర్ మండిపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగాలకు నిర్వహించే రాత పరీక్షలకు రూపాయి కూడా ఫీజు తీసుకోనని రేవంత్ అన్నాడు. టెట్ ఫీజును 400 నుంచి 2 వేలు చేశాడు. ఇది వాస్తవం. ఇంకో దారుణం ఏంటంటే.. మేం కష్టపడి పరిశ్రమలు తెస్తే..వాటిని రేవంత్ పాతరేస్తున్నాడు. ఫార్మా సిటీ పేరిట 12 వేల ఎకరాల్లో ప్రపంచంలోనే అతిపెద్ద ఫార్మా క్లస్టర్ పెట్టి, ప్రత్యక్షంగా, పరోక్షంగా 5 లక్షల ఉద్యోగాల సృష్టికి రంగంమంతా సిద్ధం చేస్తే దానిని కూడా రేవంత్ రద్దు చేశారు. ఫార్మా సిటీని పక్కనపెట్టి.. రియల్ ఎస్టేట్ చేస్తానని రేవంత్ రెడ్డి అంటున్నాడని కేటీఆర్ ధ్వజమెత్తారు.

# వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల మార్పిడి: మంత్రి ఉత్తమ్



హైదరాబాద్: వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల మార్పిడి చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. హోటల్ టూరిజం ప్లాజా సోమాజిగూడలో హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో “ఎనర్జీ ట్రాన్స్మిషన్ ఇన్ ఇండియా ఫోకస్ ఆన్ తెలంగాణ” అనే అంశంపై వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. ఈ వర్క్ షాప్ మంచి ఫలితాలు ఇవ్వాలని కోరుకుంటున్నానని అన్నారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వర్క్ షాప్ మంచి ఫలితాలు ఇవ్వాలని కోరుకుంటున్నానని అన్నారు. మేధావులు పర్యావరణవేత్తలు కలిసి వాతావరణ పరిరక్షణ క్లీన్ ఎనర్జీ కోసం డాక్యుమెంట్ రూపంలో తమకు ఇస్తే ప్రభుత్వం ద్వారా కచ్చితంగా చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తానని తెలిపారు. వాతావరణంలో చాలా మార్పులు జరిగాయి...కొన్ని సార్లు అంచనాలకు అందకుండా మార్పులు జరుగుతున్నాయని చెప్పుకొచ్చారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ప్రచారం ముగింపు

## ఎంత మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారో తెలుసా?



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ప్రచారం ముగిసింది. దీంతో 48 గంటల పాటు సైలెన్స్ పిరియడ్ ఉండనుంది. ఎల్లుండి ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్ జరగనుంది. 605 పోలింగ్ బూత్‌లలో ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. మొత్తం 4,63,839 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారు. ఈ ఉప ఎన్నికల్లో 52 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. వరంగల్, ఖమ్మం, నల్గొండ మూడు ఉమ్మడి జిల్లాల పరిధి 34 అసెంబ్లీ నియోజక వర్గాలలో విస్తరించి ఉంది ఈ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గం. ఉమ్మడి వరంగల్ జిల్లాలో అత్యధికంగా 1,73,406 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారు. ఆ తర్వాత ఉమ్మడి నల్గొండ జిల్లాలో 1,66,448 మంది, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 1,23,985 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థుల మధ్యే పోటీ ఎక్కువగా ఉంది. పట్టభద్రులను ఆకట్టుకునేందుకు ఆయా పార్టీలు ఎన్నో వ్యూహాలు అమలు చేశాయి. ఆయా పార్టీల కీలక నేతలు అభ్యర్థుల తరుపున ప్రచారం నిర్వహించారు. బీజేపీ అభ్యర్థి ప్రేమెందర్ రెడ్డికి మద్దతుగా కిషన్ రెడ్డి, ఈటల రాజేందర్ తో పాటు పలువురు బీజేపీ నేతలు ప్రచారంలో పాల్గొన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి ప్రచారంలో కేటీఆర్, హరీశ్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, పలువురు కీలక నేతలు పాల్గొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి చింతపండు నవీన్ (తీన్మార్ మల్లన్న)కు మద్దతుగా స్థానిక మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రచారం చేశారు.

# రోడ్డు ప్రమాదం



**హైదరాబాద్, మే హైదరాబాద్** – శ్రీశైలం జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం ఘోర ప్రమాదం సంభవించింది. రంగారెడ్డి జిల్లాలోని ఆమనగల్లు మండలం రామ్‌నుంతల శివారులోని హైవేపై ఆర్టీసీ బస్సు, కారు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంలో కారు నుజ్జు నుజ్జువగా మృతదేహాలను జేసీబీ సాయంతో వెలికితీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతులు హైదరాబాద్ వాసులుగా గుర్తించారు. కల్వకుర్తి నుంచి హైదరాబాద్ వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అతివేగం, నిద్రమత్తే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు.

# భారీ ఎన్ కౌంటర్ లో ఏడుగురు మృతి



**నారాయణ్ పూర్**చత్తీస్‌గఢ్‌లో మరోసారి భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. నారాయణపూర్ – బీజాపూర్ సరిహద్దులో జరిగిన ఎదురుకాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు హతమయ్యారు పలువురు గాయపడ్డారు...ఘటనాస్థలంలో భారీగా ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. మావోయిస్టుల కదలికలపై విశ్వసనీయ సమాచారం మేరకు, స్థానిక పోలీసులతో కలిసి స్పెషల్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది నారాయణపూర్ అడవుల్లో కూంబింగ్ చేపట్టారు. ఈ క్రమంలో భద్రతా బలగాలకు మావోయిస్టులు తారసపడ్డారు. దీంతో ఇరువర్గాల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ఇప్పటివరకు ఏడుగురు మావోయిస్టులు మరణించారు. నారాయణపూర్ అడవుల్లో ఇంకా ఎదురుకాల్పులు జరుగుతున్నట్లు సమాచారం. దీంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం కనిపిస్తోంది.

# ఆస్ట్రేలియాఓ షాద్ నగర్ వ్యక్తి మృతి



**నగర్**ఆస్ట్రేలియా లో దారుణం జరిగింది. షాద్ నగర్ కి చెందిన అరటి అరవింద్ యాదవ్ అనుమానాస్పద మృతి చెందాడు. ఆరవింద్ 5 రోజుల క్రితం అదృశ్యమైయాడు. చివరకు అరవింద్ సముద్రంలో శవమై తేలాడు. సిడ్నీ లోని సముద్ర తీరానికి కొద్ది దూరంలో అరవింద్ కారును పోలీసులు గుర్తించారు. లభించిన ఆధారాలతో చనిపోయింది అరవింద్ గా గుర్తించారు. మృతుడు ఉద్యోగం నిమిత్తం 12 ఏళ్లుగా సిడ్నీ లో స్థిరపడ్డడు. అరవింద్ ది హత్య.. ఆత్మహత్య.. అనేది విచారణ జరుపుతున్నారు. అరవింద్ కు 18 నెలల క్రితమే అరవింద్ కి వివాహం జరిగింది. పెళ్లి తర్వాత భార్య, తల్లితో కలిసి ఆస్ట్రేలియా వెళ్లాడు. తల్లి ఆరు రోజుల క్రితం ఇండియా కి తిరిగి వచ్చింది. న

# ఆర్టీసీ బస్సు ఢీకొని ముగ్గురు దుర్మరణం



**రంగారెడ్డి**ఆర్టీసీ, బస్సు ఢీకొని ముగ్గురు దుర్మరణం పాలైన ఘటన రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కల్వకుర్తి నుంచి హైదరాబాద్కు అతివేగంతో వస్తున్న కారు రాంనుంతల శివారులోకి రాగానే హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళ్తున్న బస్సును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు.

# జరా భద్రం...హోటళ్లలో యదేచ్ఛగా కల్తీ ఆహారం



**హైదరాబాద్, మే**ందర్భం ఏదైనా, వారం ఏదైనా భాగ్యనగరం హైదరాబాద్‌లో చాలా మంది రెస్టారెంట్‌కు వెళ్లాల్సిందే! ఉదయం బ్రేక్ ఫాస్ట్‌తో మొదలు మధ్యాహ్నం లంచ్, రాత్రికి డిన్నర్‌తో సహా అన్నీ హోటల్లోనే కడుపు నిండా తినేస్తారు. వినియోగదారుల అవసరాన్ని హోటళ్లు, రెస్టారెంట్లు అవకాశంగా మలుచుకుంటున్నాయి. రకరకాల ఫ్లేవర్లు కలుపుతూ కష్టమర్ల కడుపుకు ఫుడ్ బదులు పాయిజన్ పెడుతున్నారు రెస్టారెంట్, హోటల్ యజమానులు. పురుగులు పడిన చికెన్‌ను ఫ్రై చికెన్‌గా, పాచిపోయిన చికెన్‌ను తందూరి చేసి కష్టమర్లకు వడ్డిస్తున్నారు. ఒక్క చికెనే కాదు, మటన్, చేపలు, రొయ్యలు, రోటీ, ఐస్ క్రీములు ఇలా అన్నీ కల్తీ చేసి వినియోగదారులకు కడుపు నిండా పెడుతూ రోగాల బారిన పడేటట్లు చేస్తున్నారు.భాగ్యనగరంలోని పెద్ద పెద్ద హోటల్స్, రెస్టారెంట్లలో అధికారులు చేస్తున్న తనిఖీల్లో ఒళ్లు గగుర్పొడిచే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. నాణ్యత లేని ఆహారం సరఫరా చేస్తూ వినియోగదారుల జేబు ఖాళీ చేయడంతో పాటు వారి ఆరోగ్యాన్ని సైతం నాశనం చేస్తున్నారు హోటల్ నిర్వాహకులు. హైదరాబాద్‌లో హోటళ్లు, రెస్టారెంట్లలో ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ అధికారులు గత కొద్ది రోజులుగా తనిఖీలు చేస్తున్నారు. ప్రతి చోటా ఫ్రిడ్జ్‌ల్లో స్టోర్ చేసినవి, గడువు ముగిసిన మాంసం, వస్తువులను వంట కోసం ఉపయోగిస్తున్నట్లు గుర్తించి సీజ్ చేశారు. చాలా చోట్ల నాణ్యత లేని ఆహారం గుర్తించి వాటి నమూనాలను నాచారం ల్యాబ్‌కు పంపించారు. రిపోర్ట్స్ వచ్చిన వెంటనే కల్తీ, నాణ్యత లేని ఆహారం తయారు చేస్తున్న రెస్టారెంట్లు, హోటళ్లపై చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.హైదరాబాద్‌లో గొప్పగా చెప్పుకునే ఏ ఒక్క హోటల్‌లో ఆరోగ్యకరమైన, నాణ్యమైన ఆహారం దొరకడం లేదు. వంట చేసేందుకు వాడిన నూనెలే మళ్లీ మళ్లీ వాడుతున్నారు. ఫ్రిడ్జ్‌లో భద్రపరచాల్సిన ఆహార ఉత్పత్తులు ఎక్కడ పడితే అక్కడ చెల్లాచెదురుగా పడి ఉన్నట్లు ఫుడ్ సేఫ్టీ అధికారులు గుర్తించారు. కొన్నింటికి అవసరమైన మెడికల్ అనుమతులు కూడా లేవు. కొన్ని హోటల్స్ కిచెన్స్ మురుగు కాల్వల పక్కనే ఉన్నాయి. ఫైవ్ స్టార్ ఫుడ్ కోర్టులు, ఇక ఐస్ క్రీమ్ పార్లర్లు, బేకరీలు, ప్రమాదకర రంగులు, ఇతర కెమికల్స్ ఉపయోగిస్తున్నట్లు అధికారులు గుర్తించి అవాక్కయ్యారు. హైదరాబాద్‌లో ఉంటూ హోటల్ ఫుడ్ ఇష్టపడేవారు ఇకనైనా మేల్కోకపోతే మీ ఆరోగ్యాన్ని మీ చేజేతులా నాశనం చేసుకున్నట్లే. ప్రముఖ హోటట్ బాహుబలి కిచెన్‌లో ఆహారం రుచిగా ఉండేందుకు సింథటిక్ ఫుడ్ కలర్స్‌ను ఉపయోగిస్తున్నారు. అలాగే వంటగదిలో ఆహార పదార్థాలపై బొద్దింకలు తిరగాన్ని ఫుడ్ సేఫ్టీ అధికారులు గుర్తించారు. మాదాపూర్ ప్రాంతంలో గురువారం ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. రామేశ్వరం కేఫ్‌లో 16 వేలు విలువ చేసే గడువు ముగిసిన మినపపప్పు 100 కేజీలు, పెరుగు 10 కేజీలు, పాలు 8 లీటర్లు గుర్తించారు. బంజారాహిల్స్ బాస్కిన్ రాబిన్స్‌లో గడువు ముగిసిన వైట్ చాక్లెట్స్‌ను కనుగొన్నారు. లాబొనెల్ ఫైన్ బేకింగ్ ఇన్‌లో అమెరికా నుంచి దిగుమతి చేసుకున్న వెనిగర్ గుర్తించారు. వాటిపై దిగుమతిదారుడి పేరు, లైసెన్సులు లేవు. ఫుడ్ హ్యాండ్లర్ మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల గడువు మార్చి 15న ముగిసినట్లు గుర్తించారు. కృతుంగా, మాస్టర్ చెఫ్, రెస్టో ఓ బార్, కామత్ హోటల్, జంబో కింగ్స్ బర్గర్ హోటల్లో సైతం కల్తీ, నిల్వ ఉంచిన ఆహారం వినియోగదారులకు అంటగడుతున్నారు. క్రీమ్ స్టోన్, నాచురల్ ఐస్ క్రీమ్, కరాచీ బేకరీ, కెఎఫ్‌సీ, రోస్టరే కేఫ్, హౌస్ రాయలసీమ, రుచుల్ షా, గౌస్ కామత్ హోటల్, 36 డౌనింగ్ బ్రూ పబ్, మకావ్ కిచెన్ అండ్ బార్, ఎయిర్ లైవ్, టాకోబెల్, ఆహా దక్షిణ్, సిజ్జల్ జో, ఖాన్‌సాబ్, హోటల్ సుఖ్‌సాగర్ వెజ్ రెస్టారెంట్, జుంబో కింగ్ బర్గర్స్, రతన్‌దీప్ రిటైల్ స్టోర్ నాసిరకం ఆహారం విక్రయిస్తున్నాయి.హైదరాబాద్ వ్యాప్తంగా అధికారులు నిర్వహిస్తున్న తనిఖీల్లో ప్రతి హోటల్, రెస్టారెంట్‌లో ఆహార కల్తీ జరుగుతోంది. ఇదే కొనసాగితే వాటిని తినేవారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం ఉంటుంది. హానికరమైన రంగులు, రసాయనాలు మనిషికి ప్రాణాంతక కేన్సర్ రావడానికి కారణమవుతాయి. జీర్ణాశయం దెబ్బతిని అల్సర్ వచ్చే ప్రమాదం ఉంది. గుండె, మూత్రపిండాలు, కాలేయం పాడై పనిచేయడం మానేస్తాయి. ఫలితంగా ప్రాణాలకే ముప్పు ఏర్పడొచ్చు. కడుపునొప్పి, కీళ్ల నొప్పులు, విరేచనాలు కలిగి మెదడు పనితీరుపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. ఆహారం రుచిగా ఉండేందుకు ఉపయోగించే రసాయనిక పదార్థాలు మెదడు, ఎముకలపై ప్రభావం చూపుతాయి. అలాగే కల్తీ ఆహారంతో చర్మంపై దద్దులు, మచ్చలు ఏర్పడే అవకాశం ఉంటుంది.

# బంగాళాఖాతంలో వాయుగుండం

**హైదరాబాద్. మే** పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఇవాళ వాయుగుండంగా మారుతుందని వాతావరణ శాఖ తెలిపింది. ఈ నెల 26 తేదీ సాయంత్రానికి అది మరింత బలపడి తుపానుగా మారుతుందని స్పష్టం చేసింది. ఈశాన్యంగా కదులుతూ మధ్య బంగాళాఖాతంలో తుపానుగా మారనున్నప్పటికీ.. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతానికి ముప్పేమీ లేదని వాతావరణశాఖ స్పష్టం చేసింది. అయితే.. తెలుగు రాష్ట్రాల్లో మోస్తారు నుండి భారీ వర్షంతోపాటు.. గంటకు 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉన్నట్లు తెలిపింది.వాయుగుండంగా మారనున్న బలమైన అల్పపీడనం కారణంగా.. రెండు రోజుల్లో కోస్తాంధ్ర తీర ప్రాంతాల్లో చాలా చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు వెల్లడించింది. ఇక.. వాయుగుండం ప్రభావంతో ఉత్తర కోస్తాంధ్రలోని పార్వతీపురం మన్యం, అల్లూరి జిల్లాలతోపాటు కాకినాడ, కోనసీమ, ఏలూరు, ఎన్టీఆర్, సత్యసాయి జిల్లాల్లో చాలా చోట్ల మోస్తరు వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి. అలాగే.. శ్రీకాకుళం, అనకాపల్లి, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరుతోపాటు పలు జిల్లాల్లోనూ ఉరుములు, పిడుగులతో కూడిన వర్షాలు పడే సూచనలు ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది.బంగాళాఖాతంలోని వాయుగుండం ప్రభావంతో



మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని హెచ్చరికలు జారీ చేసింది. మరోవైపు.. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం.. వాయుగుండంగా మారునుండడంతో హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో వర్షం పడనున్నట్లు వాతావరణశాఖ చెప్పింది. తెలంగాణ వ్యాప్తంగా ఇవాళ పలు జిల్లాల్లో మోస్తరు నుండి కొన్ని చోట్ల భారీ వర్షాల పడే ఛాన్స్ ఉందంది. అటు.. బంగాళాఖాతంలో నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది.

# బాజాప్తా చెరువుల మట్టిని తోడేస్తున్నారు జోరుగా అక్రమ మట్టి దందాఅధిక లోడుతో రోడ్లు ధ్వంసం అనుమతులు లేని రవాణా... ప్రభుత్వ ఆదాయానికి గండి




**పెద్దపల్లి** వేసవి కాలం మొదలు కాగానే అక్రమ మార్కుల కన్నులు చెరువు మట్టిపై పడుతాయి. ప్రభుత్వం అనుమతి ఇచ్చిందే తడువు ఇక దోపిడీకి తెర లేపడం తరువాయి. ఇక ఇక్కడి నుండి సినిమా మొదలవుతుంది. ఆ ఊరు గ్రామ పంచాయితీ పర్మిషన్ నుండి మొదలు కొని వే బిల్లులు, ఆ పర్మిషన్ ఈ పర్మిషన్ అంటూ ఇటు అధికారుల తిరకాసులతో సదరు కాంట్రాక్టర్ల పరుగులు. ఇక అంతా అయిందనుకునే సమయంలోనే చిన్నా చితిక పెద్ద పత్రికలు, మీడియా చానళ్ళు. మళ్ళీ ఊపిరి పీల్చుకునే సమయంలో పలు సంఘాలు, ఆయా పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు గద్దల్లా వాలుతారు. అన్ని దులిపేసుకుని మట్టి దందా మొదలు కావడం కొద్ది రోజులు సజావుగా సాగుతుంది. సదరు కాంట్రాక్టర్ ఇక అడ్డు అదుపు లేకుండా 24/7 తన పని తాను కానిస్తుంటాడు. అందరికి సర్దుబాటు జరిగితే అటు వైపు ఏ ఒక్కరు కన్నెత్తి చూడరు. ఎవరికీ తక్కువైనా కాంట్రాక్టర్ కథ మళ్ళీ మొదటికే వస్తుంది. ఈలోగా కాంట్రాక్టర్ తన పని పూర్తి చేసుకొని దుకాణం మూసుకుంటాడు. కానీ ఇక్కడ తనిఖీ చేయాల్సిన అధికారులు ఎందుకు విధులు సరిగా నిర్వహించడం లేదు. అనుమతి ఇచ్చి చేతులు దులుపు కుంటే సరిపోతుందా. నిత్యం వందలాది టిప్పర్లు, లారీలు ఆయా మండలాల నుండి పెద్దపల్లి జిల్లా కేంద్రం నుండి ఇటుక బట్టీలకు మట్టి రవాణా జరుగుతున్నా చోద్యం చూస్తున్నారు. ప్రజా ధనం లూటి అవుతున్నా, వేల వేలకు జీతాలు తీసుకొని విధులు సక్రమంగా నిర్వహించని ఇలాంటి అధికారులపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కాంట్రాక్టర్ నుండి ముడుపులు ముడితే ఒకలా లేకపోతే మరోలా ఉండే అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. జిల్లా కేంద్రానికి పక్కనే ఉన్న కమాన్ పూర్, రామగిరి మండలాల నుండి ఆయా గ్రామాల మీదుగా చెరువు మట్టిని రాఘవాపూర్ ఇటుక బట్టీలకు టిప్పర్ల ద్వారా బాజాప్తా మట్టిని తరలిస్తున్న కాంట్రాక్టర్ సరైన పత్రాలు లేకుండా నిర్భయంగా తరలించడంలోని ఆంతర్యం ఏమిటి. ఆయా మండలాల అధికారులు ఏమి చేస్తున్నట్లు. గత పదిహేను రోజులుగా ఈ తతంగం సాగుతున్నదని పలువురు ప్రజలు పేర్కొంటున్నారు. నిత్యం మంథని – పెద్దపల్లి జిల్లా కేంద్రానికి తనిఖీల పేరుతో తిరిగే జిల్లా స్థాయి అధికారులకు కూడా కనిపించడం లేదా అంటూ పలువురు ఆరోపణలు గుప్పిస్తున్నారు.

# బాధిత కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సహాయం అందచేత



సిరిసిల్ల, మే 25 : కోనరావుపేట మండలం వెంకట్రావుపేటకు చెందిన మారుపాక రాజవ్వ (48) ప్రమాదవశాత్తు మృతిచెందగా, బాధిత కుటుంబానికి (కుమారుడు మారుపాక బాలకిషన్) కు రూ.50వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ నెల 21 వ తేదీన మంగళవారం కోనరావుపేట మండలం వెంకట్రావుపేట లోని కేశవరావు చెరువులో ఉపాధి హామీ పనికి గ్రామానికి చెందిన కూలీలు వెళ్లారు. ఈ క్రమంలో చెరువు నుంచి తొలగించిన మట్టిని ట్రాక్టర్ లోకి ఎత్తి ఆ ప్రదేశంలోనే కూర్చున్నారు. ప్రమాదవశాత్తు మట్టి పెళ్ళలు వారిపై కూలగా, మారుపాక రాజవ్వ (48), మరో ఆరుగురికి గాయాలు అయ్యాయి. వారందరినీ సిరిసిల్ల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. తీవ్రంగా గాయపడిన రాజవ్వ మృతి చెందింది. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం యాక్ట్ 2005 రూల్స్ ప్రకారం రెండు లక్షల రూపాయలు ఎక్స్గ్రేషియా కు గాను ప్రభుత్వం తరుపున ఉపాధి హామీ అధికారులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి తక్షణ సహాయం గా వారి కుటుంబానికి మరుసటి రోజు తేదీ 22.5.24 నాడు రూ. 50 వేల ఆర్థిక సహాయాన్ని అందజేసారు. మిగిలిన ఒక లక్ష 50 వేల రూపాయలు త్వరలో అందజేయగలమని తెలిపారు.



దుబాయ్ పర్యటన ముగించుకొని హైదరాబాద్ చేరుకున్న ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ గారు జూబ్లీహిల్స్ లోని ముఖ్యమంత్రి నివాసంలో శ్రీ రేవంత్ రెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. గల్ఫ్ పర్యటన గురించి అడిగి తెలుసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు... గల్ఫ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. కాంగ్రెస్ ప్రభుత్వం గల్ఫ్ కార్మికుల అండగా ఉంటుందని రేవంత్ రెడ్డి గారు తెలిపారు.. త్వరలోనే గల్ఫ్ కార్మికులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు.

# పేదల ప్రాణాలకు విలువ లేదా



రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం వెంకట్రావుపేటలో ఉపాధీ హామీ పనుల్లో మట్టిపెల్లలు కూలీ ఒక ప్రాణం గాలిలో కలిసింది..పలువురు గాయపడ్డారు. ఒక జరగరాని సంఘటన జరిగినప్పుడు.. ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగం మీద ఉంటుంది. నిన్న ఇదే రాజన్న సిరిసిల్ల జిల్లా బోయిన పల్లి మండలం రత్నంపేటలో ఉపాధీ హామీ పనుల నిర్వహణ పరిస్థితి చూడండి.. ఈ విడియోను.. పోటోలను సిపిఎం నేత గురజాల శ్రీధర్ వాట్సప్ గ్రూపులో పెట్టి .. ఉపాధీ హామీ కూలీలకు ప్రమాదం పొంచి ఉందని, రక్షణ చర్యలు ఏర్పాటు చేయాలని వేడుకున్నాడు. ఈ విడియో చూస్తేనే భయకరంగా ఉంది. ప్రమాదవశాత్తు ఈ ఎత్తైన మట్టి కుప్పలు కూలితే ఎంత మంది కూలీల ప్రాణాలు గాలిలో కలుస్తాయో ఒక్కసారి ఆలోచన చేయండి.. అసలు ఈజీఎస్ ఆ మండలశాఖ అధికారులు ఏం చేస్తున్నారు..ఇదేనా ఉపాధీ హామీ పనుల నిర్వహణ. సిరిసిల్ల కలెక్టర్ అనురాగ్ జయంతి . ఇటువంటి రక్షణ లేని సైట్లలో ఉపాధీ హామీ పనులు బంధ్ చేయించిన పర్వాలేదు.. పనికంటే కూలీల ప్రాణాలు ముఖ్యం. జిల్లా వ్యాప్తంగా ప్రమాదపుటంచుల్లో ఉన్న ఉపాధీ హామీ సైట్లు కానీ, ఏ ఇతర పనుల కానీ అధికారులు పరిశీలన చేసి.. రక్షణ లేని చోట్ల పనులు నిలిపివేయాలని, లేకపోతే.. రక్షణ చర్యలు చేపట్టి.. పనులు కొనసాగించాల్సిన అవసరం ఉంది. చేతులు కాలాక ఆకులు పట్టుకునే బదులు.. ముందుస్తు రక్షణ చర్యలు చేపట్టడం మంచింది. తెలంగాణా ప్రభుత్వం కూడా ఉపాధీ హామీ కూలీల ప్రాణ రక్షణపై దృష్టి సారించాలి రాజన్న సిరిసిల్ల జిల్లా సంఘటనను పరిశీలించి. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్ల సత్యం . మీరు కూడా తమ నియోజకవర్గంలో ఇటువంటి ప్రమాదకరపు సైట్ల పై దృష్టి సారించాలి అన్న.

# హైదరాబాద్‌కు 125 డీలక్స్ బస్సులు

హైదరాబాద్: నగరంలో సిటీ బస్సు ప్రయాణం రూపురేఖలు మారనున్నాయి. తాజాగా 25 ఎలక్ట్రిక్ ఏసీ, 25 నాన్‌ఏసీ ఎలక్ట్రిక్ బస్సులు నగరానికి రాగా.. మరో 450 ఎలక్ట్రిక్ బస్సులు జులై నాటికి రోడ్డెక్కనున్నాయి. మెరుగైన ప్రయాణాన్ని అందించేందుకు టీజీఎస్‌ఆర్టీసీ చర్యలు తీసుకుంటోంది.

Edited, Printed, Published and Owned by B. Narsingh, Printed at Vijetha Graphics & Offset Printers, H.No. 19-6-109, Godavarkhani,Karimnagar, Telangana State.
Published at H.No. 15-4-76/4, Jawaharnagar, Godavarikhani, Karimnagar, Telangana State,. Editor B. Narsingh, Email : kranthi995@gmail.com, tnfocus5@gmail.com
Website : telangananundifocus.com Cell : 7995282199, 9959954795.